క్లుప్తంగా

కోడిపందేలను అడ్డుకునేందుకు బృందాలు



సచివాలయ, రెవెన్యూ ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు వెంకటరమణ

ఉంగుటూరు: జూదం, కోడిపందేలను అడ్డుకునేందుకు మండలం, గ్రామస్థాయి బృందాలు ఏర్పాటు చేశామని, వారు నిరంతరం పర్యవేక్షిస్తారని ఉంగుటూరు తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. ఆదివారం రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో బృందాల ద్వారా ప్రచారం చేయాలని, కోడి పందేలు, జూదక్రీడల ఏర్పాట్లను ముందుగా గుర్తించి నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. ప్రభుత్వ జూద క్రీడలు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సై స్వామి, ఈవోపీఆర్డీ షంషుద్దీన్ పాల్గొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక



పురుషోత్తం



భానుప్రసాద్



ప్రవీణ్

దెందులూరు: సౌత్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో పోటీలకు దెందులూరు మండలం వేగవరంలోని హేలాపురి ఇంజనీరింగ్ విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని కళాశాల ఏవో టీఎస్ కరుణానిధి అన్నారు. ఆదివారం వేగవరం కళాశాలలో ఆయన మాట్లాడుతూ కాకినాడలో సోమవారం నుంచి జేఎన్‌టీయూ తరుపున సౌత్ ఇంటర్ యూనివర్సిటీ పోటీలు ప్రారంభం కానున్నాయన్నారు. ఈ పోటీల్లో ఖోఖోకు భానుప్రసాద్, ప్రవీణ్, పురుషోత్తంలు ఎంపిక కావడం తమకు కళాశాలకు గర్వకారణం అన్నారు. కాకినాడ పోటీలకు వెళ్లే విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎస్.రాధాకృష్ణ, హెచ్‌వోడీ తేజ, శివరాజ్, సూర్య గణేష్, కోటేశ్వరరావు, జెస్సీ కిరణ్, సీనియర్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, శ్యామల, ఈశ్వరి అభినందించి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

సీతారామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



హోమం నిర్వహిస్తున్న పూజారులు

భీమడోలు: గుండుగొలనులోని సీతారామస్వామి ఆలయంలో ఆదివారం లోక కల్యాణార్థం, భక్త జన సంరక్షణార్థం నవగ్రహయుత సుదర్శన హోమం, హనుమద్ సమేత సీతారాములకు ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగారాజ్ కుమార్ పర్యవేక్షణలో అర్చక స్వాములు సుధీరాచార్యులు ఆధ్వర్యంలో పూజారుల బృందం విశేష పూజలుచేసారు.గ్రామంలోని భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

పేకాట శిబిరంపై దాడి

దెందులూరు: చల్లపల్లి గ్రామంలో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి 8మందిని అరెస్టు చేసినట్లు దెందులూరు ఎస్సై వీర్రాజు తెలిపారు. డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు జూద క్రీడలు నిర్వహించకుండా నిఘా ఉంచామన్నారు. ఆదివారం చల్లపల్లిలో పేకాడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి 8 మందిని అరెస్టు చేశామని వివరించారు. వారి వద్ద నుంచి రూ. 9300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జూదరుల అరెస్టు

ఉంగుటూరు: తల్లాపురంలో కోడిపందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్సై స్వామి ఆదివారం తెలిపారు. ఈ దాడిలో కోడిపుంజును, కోడికత్తిని, నిందితుల వద్ద నుంచి రూ.1,110 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. గోపినాథపట్నంలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,210 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై స్వామి తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు

ఏలూరు: తన తల్లి గత కొద్దిరోజులుగా కనబడుటలేదని ఓ కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు. పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం రాయన్నపాలేనికి చెందిన బండి గౌరవేంద్ర తల్లి బండి దుర్గ హైదరాబాద్‌లో వంట మనిషిగా పనిచేస్తుంది. ఈ మేరకు ఈ నెల 1వ తేదీన కుమారుడి ఇంటికి వచ్చిన తిరిగి ఈనెల 3న రాయన్నపాలెం నుంచి హైదరాబాద్ వెళ్తానని చెప్పి పని ప్రాంతానికి వెళ్లలేదని, బంధువుల ఇళ్ళ దగ్గర కూడా లేదని, తల్లి ఆచూకీ తెలియలేదు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

సచివాలయాలతో ప్రజల చెంతకు ప్రభుత్వ పాలన

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- బువ్వనపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



బువ్వనపల్లిలో పథకాల లబ్ధిదారులకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

నిడమర్రు: దేశంలో ప్రభుత్వ పాలన ప్రజల చెంతకు తెచ్చిన ఘనత ఏపీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం బువ్వనపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం గ్రామంలో రెండో రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబాన్ని పలకరించి వారికి మూడేళ్లలో ప్రభుత్వ పరంగా అందిన పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సామాన్యుడు తన సమస్యను ఎవరికి చెప్పాలో తెలియక అనేక ఇబ్బందులు పడేవారన్నారు. నేడు గ్రామ సచివాలయాలకు వెళ్లి ఆ సమస్యపై అర్జీ అందజేస్తే పరిష్కారం లభిస్తుందన్నారు. ప్రతీ కుటుంబ సమీపంలో వలంటీరు అందుబాటులో ఉన్నారని వారి ద్వారా వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు వచ్చే అవకాశం కలిగిందన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని శాఖల అధికారులు గ్రామ సచివాలయాల వద్ద ఉదయం 10 నుంచి 5 గంటల వరకూ అందుబాటులో ఉండటం ఏ ప్రభుత్వం చెయ్యలేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారుల పనితీరు, పథకాల అమలు విధానాన్ని క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా స్వయంగా వచ్చినట్లు ఆయన వివరించారు. పలువురు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అర్హత ఉంటే పార్టీలకు, కులాలకు అతీతంగా పింఛన్ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ఇన్‌చార్జ్ పుప్పాల కన్నబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెజ్జు వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సంకు శ్రీనువాసరావు తదితరులున్నారు.

కోడిపందేలను ప్రోత్సహిస్తే కఠిన చర్యలు

ఉంగుటూరు: కోడిపందేలు ఆడిన, ప్రోత్సహించిన వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని ఉంగుటూరు తహసీల్దార్ వెంకటరమణ స్పష్టం చేశారు. శనివారం ఉంగుటూరు మండలం ఎ.గోకవరం, చేబ్రోలులో కోడిపందేలు ఆడవద్దని ప్రజలను చైతన్యపరుస్తూ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో వెంకటరమణ మాట్లాడుతూ పేకాట, కోడిపందేలను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. జూదాలకు స్థలం ఇచ్చినవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామస్థాయిలో నియమించిన టీములు, నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి గుండవరపు రమణ, గణపవరం సీఐ సుభాష్, ఎస్సై స్వామి, ఆయా గ్రామాల సర్పంచులు మిద్దే సత్యవతి, రందే లక్ష్మీసునీత, ఎంపీటీసీ సభ్యులు దేవదాసు విజయనిర్మల ధర్మరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో ఆంజేయబాబు పాల్గొన్నారు. ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



కురెళ్లగూడెంలో అమ్మవారికి దర్శించుకుని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందుకోవాలని దీంతో మానసిన ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. కురెళ్లగూడెంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామదేవత గంగానమ్మ, ఎనుకుంట అంకమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి ఊరేగింపు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద గల చెర్వు గట్టుపై ప్రత్యేక పందిళ్లలో కొలువైన అమ్మవారిని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించుకుని పూజలు చేసారు. తొలుత ఆలయ కమిటీ వాసన్నకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రజలంతా ఐక్యతతో జరుపుకోవడం శుభపరిణామన్నారు. ప్రతి రెండేళ్లకోసారి ఈ జాతర సంబరాలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించడం చాలా సంతోషదాయకమన్నారు. ఈనెల 19వ తేదీ వరకు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. సర్పంచ్ గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కలలను సాకారం చేసుకోవాలి



విద్యార్థులకు నీతి కథల ఆవశ్యకతను వివరిస్తున్న బాలనాగు విజయసారథి, తుమ్మల ఉమామహేశ్వరరావు

భీమడోలు: ప్రతి ఒక్కరూ కలలు కనండి వాటిని సాకారం చేసుకోవాలని వక్తలు అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమంలో ఆదివారం సామూహిక పుస్తక పఠనం కార్యక్రమం ఉల్లాసభరిత వాతావరణంలో జరిగింది. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 25 మంది బాలబాలికలు పాల్గొని ఎంపిక చేసుకున్న పుస్తకాలను చదివారు. జిల్లా కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు ఆదేశాల మేరకు భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలకు సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి ప్రోత్సహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి లయన్స్ డైమండ్స్ అధ్యక్షుడు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు తుమ్మల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను అలవర్చుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమాల్లో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌వీ అమర్‌నాథ్, జి.నాగమణి, రీడర్స్ ఫోరం సభ్యుడు పీవీ రాఘవులు, పెద్దలు కామన ధర్మరాజు, వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థుల సందడి



గుండుగొలనులో 1984-89 బ్యాచ్ విద్యార్థులు టీచర్లతో దిగిన ఫొటో

భీమడోలు: గుండుగొలను మావులేటి సోమరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1984-89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుండుగొలనులో ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుకున్న 120 మంది విద్యార్థులంతా తమ కుటుంబ సమేతంగా ఈ కార్యక్రమానికి హాజరై పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాదాభివందనం చేసి వారి నుంచి ఆశీస్సులందుకున్నారు. తాము చదువుకు పాఠశాల పరిసరాలను చూసి పరవశించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాల్లో స్థిరపడిన వారంతా ఒక్కచోటకు చేరుకుని సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన 12 మందికి నూతన వస్త్రాలను అందించి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. తొలుత మృతి చెందిన సహచర విద్యార్థులు, టీచర్లను స్మరించుకుంటూ కొద్ది నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం వారంతా సహపంక్తి భోజనాలు చేసారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు కృషి



బువ్వనపల్లి లేఅవుట్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

నిడమర్రు: ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో నిర్మిస్తున్న వైఎస్సార్-జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం బువ్వనపల్లిలో వైఎస్సార్ జగనన్న-వాసన్న కాలనీలో రూ.26 లక్షలతో సమకూర్చిన పబ్లిక్ కుళాయిలను, విద్యుత్ లైన్‌లను, విద్యుత్ దీపాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల ఇన్‌చార్జ్ పుప్పాల కన్నబాబు, జెడ్పీటీసీ కోడే కాశి, ఎంపీపీ ధనుకొండ ఆదిలక్ష్మి, మండల కన్వీనర్ సంకు సత్యకుమార్, సర్పంచ్ కిలారి సత్యవతి రవిబాబు, ఉపసర్పంచ్ వెల్లంకి నరేష్ తదితరులున్నారు.

పారిజాతగిరిలో వైభవంగా దీపోత్సవం





పారిజాతగిరిలో దీపోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, గోదాదేవికి సారెను తీసుకువచ్చిన వికాస తరంగిణి సేవా సంస్థ సభ్యులు →

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఆదివారం 24వ రోజు దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గోదాదేవి శ్రీకృష్ణునికి మంగళాశాసనము చేసిన విధముగా ధర్మ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరూ విశేషముగా అలంకరించిన పల్లెములలో ఆవు నేయి దీపములను వెలిగించి మంగళాశాసన పాశురమును పఠిస్తూ హారతులు సమర్పించారు. అనంతరం జంగారెడ్డిగూడెం వికాస తరంగిణి సేవా సంస్థ ఆధ్వర్యంలో గోదాదేవికి పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రములు, ఫలా, పుష్పాలతో సారె సమర్పించారు. అనంతరం భక్తులు పారిజాతగిరి కొండ చుట్టూ నూతనముగా ఏర్పాటు చేయబడిన మార్గములో గోవింద నామ స్మరణలతో గిరి ప్రదక్షణ చేశారు. సారెలో అమ్మవారికి సమర్పించిన గాజులు వివిధ రకముల ఫలములు ప్రసాదంగా భక్తులకు అందజేశారు. అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు, రిషికేష్, రాఘవాచార్యులు, కుమారాచార్యులు, పూజా కార్యక్రమములు నిర్వహించారు. భక్తులకు సూర్య డెంటల్ ఆసుపత్రి డాక్టర్ శివరామ్ దంపతులు, వికాస తరంగిణి సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. వికాస తరంగిణి సభ్యులు రామసత్య వీర వెంకట అప్పారావు, శ్యామలాంబ, సత్యనారాయణ, డాక్టర్ శివరాం కుమార్, శ్రీరామచంద్రమూర్తి, దిప్పకాయలపాడు, అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతిరాజు పాల్గొన్నారు.

నేడు గుణపర్రులో 'గడపగడపకు'

నిడమర్రు: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మందలపర్రు సచివాలయం పరిధిలోని గుణపర్రులో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి కొనసాగుతుందని వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొని గ్రామంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందిన ఆర్థిక లబ్ధి వివరించి, వారి సమస్యలు తెలుసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైసీపీ శ్రేణులు పాల్గోవాలన్నారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవం

పందికోడు కోడు వంతెన వద్ద గుణపర్రు- శ్మశాసన వాటిక రహదారి వంతెనగా రూ.12 లక్షలతో నిర్మించిన బెయిలీ బ్రిడ్జిని సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభిస్తారని వైసీపీ కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. అనంతరం సీసీ రోడ్లు, రూ.10 లక్షలతో ఏర్పాటు చేస్తున్న మైక్రో వాటర్ ఫిల్టర్, జల జీవన్ శ్రవంతి మిషన్‌లో నిర్మిస్తున్న పలు పనులు ఎమ్మెల్యే ప్రారంభిస్తారని సత్యకుమార్ తెలిపారు.

ప్రజా సంకల్ప పాదయాత్రతో రాష్ట్రంలో సంక్షేమ పాలన

భీమడోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్రను దిగ్విజయంగా పూర్తి చేసి, రాష్ట్రంలో సంక్షేమ పాలన తీసుకొచ్చారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ద్విగిజయంగా పూర్తి చేసిన రోజును పురస్కరించుకుని నియోజకవర్గంలోని వాడవాడలా పార్టీ నాయకులు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాల అలంకరణ, క్షీరాభిషేకాలు, పలు సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధి సుభాష్ ఆదివారం కోరారు. ఈనెల 9వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు గణపవరం ఇందిరమ్మ కాలనీలోని వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. కేక్ కట్ చేస్తారన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ డైరెక్టర్లు, చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

10 నుంచి గ్రామ సభలు

ఉంగుటూరు: నాన్ జోన్ పరిధిలో ఉన్న చేపల చెరువులను రెగ్యులర్ చేసే నేపథ్యంలో గ్రామాలవారీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ఉంగుటూరు మండల మత్స్య శాఖ అధికారి కె. మంగరావు ఆదివారం తెలిపారు. చేపల చెరువుల సర్వే నంబరు, విస్తీర్ణం, వివరాలు మత్స్య శాఖ ద్వారా గ్రామసభలలో సేకరించి జిల్లా కమిటీకి నివేదిస్తామని తెలిపారు. ఈసభలు 10న కాకర్లమూడి, వీఏ పురం, దొంతవరం, 11న రాచూరు, రావులపర్రు, 12న చేబ్రోలు తల్లాపురం, కైకరం గ్రామాల్లో నిర్వహిస్తామని తెలిపారు.

వైద్యఖర్చుల చెల్లింపు నిర్ణయంపై అర్చకుల హర్షం

దెందులూరు: దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులు, వారి కుటుంబ సభ్యులకు నూరుశాతం వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు ఆదేశాలు జారీచేయడం సంతోషంగా ఉందని దెందులూరు మండల అర్చకుల సంఘ సభ్యులు ఆదివారం హర్షం వ్యక్తం చేశారు. అర్చక సంక్షేమ నిధి నుంచి గతంలో 50శాతం మాత్రమే ఖర్చు చేసేవారని అన్నారు. అర్చకులు, వారి కుటుంబ సభ్యుల జీవన విధానం, ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని 100శాతం ఖర్చులు చెల్లించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేయడంతో పాటు తక్షణమే అమలు చేయాలని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ నిర్ణయం అర్చకులు, వారి కుటుంబ సభ్యుల పట్ల సీఎం జగన్‌కు ఉన్న ప్రాధాన్యత, శ్రద్ధను తెలియజేస్తోందన్నారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖలోని అర్చకులు సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి



పెదవేగిలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీలో విజేతలకు షీల్డ్ బహుకరించిన దృశ్యం

ఏలూరు: యువత అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం పెదవేగి గ్రామంలో పెదవేగి, దెందులూరు జట్ల మధ్య జరిగిన ఫైనల్ క్రికెట్ మ్యాచ్, టోర్నమెంట్ విజేతలకు దెందులూరు శాసన సభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి చేతుల మీదగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, పెదవేగి ఎంపీపీ తాతా రమ్య, పెదవేగి సొసైటి అధ్యక్షులు పెనుమాక సుబ్బారావు పాల్గొన్నారు.

జయపురం రహదారి పరిశీలన

పెదపాడు: మండలంలోని ముప్పర్రు -జయపురం రహదారి అభివృద్ధి పనులను పెదపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఘంటా పద్మశ్రీ పరిశీలించారు. ఇటీవల ఈ రహదారి నిర్మాణాఇకి దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి చేతుల మీదుగా రూ. 2కోట్ల నిధులతో శంకుస్థాపన చేశారు. కొద్దిరోజులుగా రహదారి అభివృద్ధి వేగంగా జరుగుతున్నాయి. దీంతో ఆదివారం పెదపాడు జెడ్పీటీసీ సభ్యురాలు ఘంటా పద్మశ్రీ పరిశీలించి కాంట్రాక్టర్ కు పలు సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, గుణుపూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.